భయపెడుతున్న శునకాలు!

- విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు
- భయాందోళనలో ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలి విజ్ఞప్తి



టీపీఎంహెచ్ స్కూల్ డౌన్‌లో రోడ్డు మధ్యలో కుక్కలు



కలెక్టర్ బంగ్లా వెనుక రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు



సిద్ధార్థ స్కూల్ రోడ్డులో కుక్కలగుంపు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగర వాసులను శునకాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహన దారులపై దాడి చేస్తున్నాయి. రాత్రి సమయంలో అయితే వీటి స్వైర విహారం మరీ ఎక్కువగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం వెళ్లే వారిపై కుక్కలు దాడి చేస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే స్కూళ్లకు, ఆఫీసులకు వెళ్లే పాదచారులు, సైకిళ్లు, మోటారు వాహనాలపై వెళ్లే వారిని వెంటపెడుతున్నాయి. కుక్కలకు భయపడి చాలామంది పాదచారులు తమతో పాటు కర్రలను పట్టుకొని వెళుతున్నారు. నగరంలోని పీఎన్ కాలనీ, బలగ, ఇప్పిలి వీధి, ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్, సూర్యమహల్ కూడళ్ల వద్ద, కలెక్టర్ బంగ్లా వెనుక ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, జెడ్పీ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, కలెక్టర్ కార్యాలయం రోడ్డు తదితర చోట్ల కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. టీపీఎం హెచ్ స్కూలు పరిసర ప్రాంతాలలో శునకాల సంచారం మరీ ఎక్కువగా ఉందని ఆ ప్రాంతీయులు చెబుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని కోరారు.

కుక్కల సమస్య ఎక్కువే



కుక్కల సమస్య మా ప్రాంతంలో ఎక్కువగా ఉంది. మేము షాపులు కట్టుకుని ఇంటికి వెళ్లే సరికి రాత్రి 12 అవుతోంది. ఆ సమయంలో వస్తే కుక్కలు వెంటపెడుతున్నాయి. మాషాపు పెట్రోమాక్సు వీధిలో ఉంది. అక్కడ కూడా కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని నియంత్రించాలి.

– ఇప్పిలి గోవిందరావు, ఇప్పిలి వీధి, వ్యాపారి, శ్రీకాకుళం

శునకాలను నియంత్రించాలి



శ్రీకాకుళం నగరంలో కుక్కలు స్వైర విహారం చేస్తూ భయపెడతున్నాయి. వీటితో అందరూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వీటిని నియంత్రించాలి. చిన్నారులు, పాదచారులు భయంగా ఉంటున్నారు.

– డబ్బీరు మోహనరావు, హౌసింగ్ బోర్డు కాలనీ

గుడివీధిలో చాలా ఉన్నాయి



మా గుడివీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రిపూట వచ్చేటప్పుడు ఇబ్బందిగా ఉంది. గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి. అధికారులు స్పందించి కుక్కలను నిరోధించాలి.

– మల్లాది ప్రసాద్, గుడివీధి

కార్యకర్తలకు అండగా ఉంటా..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామ స్థాయిలో ఉన్న ప్రతి కార్యకర్తకూ అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సంతవురిటి గ్రామంలో ఆయన ఆదివారం పార్టీ శ్రేణులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తనకు సహకరించారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమేన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి మంచి బలం ఉందన్నారు. జగనన్న ప్రభుత్వ హయంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరరావు, చిత్తిరి మోహన్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఉప సర్పంచ్ చందనాల గణపతిరావు, వాండ్రంగి వెంకటేష్, లావేరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బూరాడ చిన్నారావు తదితరులు ఉన్నారు.

తోటల పెంపకానికి ప్రాధాన్యం



ఎచ్చెర్లలో అమ్మకానికి నీలగిరి క్లోనింగ్ మొక్కలు



కింతలిమిల్లు నర్సరీ నుంచి వాహనంలో సరుగుడు మొక్కలు తీసుకువెళ్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: మెట్ట ప్రాంత రైతులు తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం మండలాల్లోని పలు ప్రాంతాల రైతులు తోటలు సాగు చేస్తున్నారు. నీలగిరి, సరగుడు, టేకు, జీడి మామిడి వంటి పంటలకు ప్రాధాన్యత లిస్తున్నారు. ఒక్కసారి సాగు చేశాక పంట వచ్చేవరకు పెట్టుబడి ఉండదు. ఉద్యానవన పంటలు, కూరగాయల సాగు వంటి వాటికి నీరు అవసరం. తోటల సాగుకు వర్షాధారం చాలు. రైతులు ప్రస్తుతం ముమ్మరంగా తోటలు సాగుచేస్తున్నారు. ఎచ్చెర్ల, కింతలి మిల్లు ప్రాంతాల్లో భద్రాచలం వంటి ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన క్లోనింగ్ నీలగిరి, సరగుడు వంటి మొక్కలు విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా నర్సరీలు వర్షాకాలంలో నిర్వహిస్తున్నారు.

నగరాలపేట రోడ్డు నిర్మాణానికి సహకరించండి



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రజాపరిరక్షణ వేదిక సభ్యులు

గార: కళింగపట్నం పంచాయతీ ప్రధానమైన నగరాలపేట రోడ్డు నిర్మించాలని ప్రజాపరిరక్షణ వేదిక సభ్యుడు ముంజేటి సాయిరాం కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ఆదివారం తన కార్యాలయంలో కలిసి వినతినందించారు. రోడ్డు నిర్మాణం వలన మదీనా బాబా దర్గాకు వెళ్లే భక్తులతో పాటు స్థానిక నగరాలపేట, కె.మత్స్యలేశం వెళ్లేందుకు అవకాశముందన్నారు. ఎస్సీ కాలనీలో రెండు దశాబ్దాల కిందట నిర్మించిన కాలువలు పాడయ్యాయని, సీసీ రోడ్డు నిర్మించాలని కోరగా అంచనాలు రూపొందించి పనులు జరిగేలా చూస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని సాయిరాం తెలిపారు.

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల: మండలంలోని కేకేనాయుడుపేట గ్రామంలో గల లలితాదేవి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలభిషేకం, కుంకుమ పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయం అర్చకుడు వంశీకుమార్, ధర్మకర్త నర్సింగరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



మదీనాదర్గా గుడిలో ఎమ్మెల్యే శంకర్ తదితరులు

గార: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, కళింగపట్నాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం కళింగపట్నంలో పర్యటించిన ఆయన పర్యటించారు. మదీనా దర్గాకు వెళ్లి బాబా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కళింగపట్నంలో సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. అనంతరం కె.మత్స్యలేశం బీచ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గుండ భాస్కర రావు, గొండు మూర్తి, కెప్టెన్ మైలపల్లి జనార్దన్ ఉన్నారు.

కనీస అవసరాలు ముఖ్యం



సదస్సులో మాట్లాడుతున్న విష్ణుమూర్తి

ఇచ్ఛాపురం రూరల్: గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు కనీస అవసరాలైన కూడు, గూడు, విద్య, వైద్యం అనేవి ఎంతో అవసరమని స్వేచ్ఛా హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ డైరెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కూన విష్ణుమూర్తి అన్నారు. బెన్నుగానిపేటలో యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ ద్వారా స్థానిక ప్రజలతో కలసి అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. తమ ఆర్గనైజేషన్ ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించడం జరుగుతోందన్నారు. మంచినీరు, విద్య, వైద్యం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ పూడి కిరణ్‌కుమార్, మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు డి.హరిశ్చంద్ర, ఎం.సాయికృష్ణ, ఎ.విశ్వనాథం, సీహెచ్.రవికుమార్, సల్ల ప్రవీణ్, ఎస్.సంతోష్, బి.మనోజ్‌కుమార్, జి.బలరాం, ఆర్.రాము, అంబటి కుమారీ పాల్గొన్నారు.

కామ్రేడ్ ఓంకార్ మృతి తీరనిలోటు

టెక్కలి: ఉపాధ్యాయ సంఘాల నాయకుడు, ప్రజా నాట్య మండలి కళాకారుడు బత్తిని ఓంకార్ మృతి ఆయా సంఘాలకు తీరని లోటు అని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నార. ఆదివారం టెక్కలిలో ఓంకార్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.వైకుంఠరావు, కె.బాలయ్య, పి.ధర్మారావు, విజయ్‌కుమార్, ఎస్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, దుర్గారావు ఉన్నారు.



ఓంకార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు

నీలమణిదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఖరీఫ్ ప్రారంభం నేపథ్యంలో వరి విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో రైతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చాలామంది వాహన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు ఆలయం వద్ద భక్తుల రద్దీ అధికంగా ఉంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య సేవలు అందజేస్తున్న వైద్యుడు సురేష్

ఆమదాలవలస: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, సంఘ సేవకులు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ సూచించారు. పురపాలక సంఘం ఆరో వార్డు నందగిరిపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని, ప్రజలందరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలో మొక్కలను నాటారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సన్‌రైజ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నింభాషిణి అమ్మవారి చల్లదనం



అమ్మవారి గుజముద్దను ఊరేగిస్తున్న భక్తులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామంలో నింభాషిణి అమ్మవారి చల్లదన ఉత్సవం గ్రామంలోని ఉపాధిహామీ వేతనదారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గజముద్దను మేళతాళాలు, పగటి వేషాలతో ఊరేగింపు నిర్వహించారు. చల్లదన ఉత్సవంలో గ్రామస్తులు, వేతనదారులు పాల్గొన్నారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఊడికలపాడులో సత్సంగం

కోటబొమ్మాళి: ఊడికలపాడు గ్రామంలోని శ్రీరామమందిరం వద్ద హిందూధర్మ ప్రచార కర్త సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన ప్రవచనకారుడు నిర్విషయానందస్వామి, ప్రకాశనందస్వామి, బొత్స హరిప్రసాద్‌లు ప్రవచనాలను బోధించారు. మనిషికి సత్సంగం ద్వారా జ్ఞానసముపార్జన చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జ్ఞానమార్గంలో నడిపిన దక్షిణామూర్తి



హరనాథరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మనుషులను అజ్ఞానం నుంచి జ్ఞానమార్గంలో నడిపించే గురుమూర్తి దక్షిణామూర్తి అని వక్త పైడి హరనాథరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం దక్షిణామూర్తి స్తోత్రం-శంకర అద్వైతం అనే అంశంపై ప్రసంగించారు. ఆత్మ పరమాత్మ ఒక్కటే అనే అద్వైతాన్ని తెలియచేసే అద్భుతమైన స్తోత్రం ఇదని అన్నారు. నిత్యం పారాయణ చేయడం ద్వారా మనలో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతోందన్నారు. ముందుగా వక్త హరనాథరావును మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో నిష్టల నర్సింహమూర్తి, పి.పతంజలి శాస్త్రి, విశ్వేశ్వరరావు, బి.జోగారావు, పి.రామ్మోహనరావు, కార్తికేయశర్మ, ఈశ్వరరావు, కె.వేంకటరావు, సరస్వతి, లక్ష్మీ, తవుడు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ సభ్యులు

రణస్థలం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కన్వీనర్ ఆర్.హరిబాబు పిలుపునిచ్చారు. పతివాడపాలెం గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు హరిత సొసైటీ చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందించారు. వన మహోత్సవానికి సహకరించి హరిత సొసైటీ కన్వీనర్ హరిబాబును గ్రామస్తులు సత్కరించారు. సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, పతివాడ సత్యం, హరిత సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, గ్రామ పెద్దలు బి.జగన్నాథం, వి.శ్రీరామ్మూర్తి, ఆర్.లక్ష్మణరెడ్డి, పి.వాసు, గ్రామ యువత పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఐ మధుసూదనరావు

జి.సిగడాం: యువత చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ మధుసూదనరావు సూచించారు. వెంకయ్యపేట, జి.సిగడాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన డ్రగ్స్, మద్యం నిర్మూలనపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పల్లెలో ఆసాంఘిక కార్యకాలపాలు పాల్పడేవారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పండగల సందర్భంగా పల్లెల్లో అపరచిత వ్యక్తులు సంచరిస్తే అటువంటి వారిపై సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ రమాదేవి ఆదివారం తెలిపారు. 28 గ్రామ సచివాలయాల పరిధిలో అన్ని రకాల సమాజిక పింఛన్లు 12,621 పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు సెలవులు పెట్టిన దగ్గర ఇతర శాఖల సిబ్బందిని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల పరిధిలో కనీసం 11 మంది ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి సిద్ధం చేసినట్లు వివరించారు.